# ప్రతిబింబం

భీమవరపు పురుషోత్తం



సూర్యుడు పొడుచుకొస్తున్నాడు. మంగి బయల్దేరింది. పొద్దుట్నించి ఒకటే నడక. బిచ్చమెత్తుకుంటూ జీవించాలంటే ఈ రోజుల్లో మాటలు కాదు. అన్ని రకాల మనస్తత్వాలు గల వాళ్ళనూ జయించాలి. ఎండకు, వానకు తడిసినట్టే – ఓపిక సహనాల్ని జీర్ణించుకోవాలి. చీదరింపుల్నీ, తిట్లనూ నిశ్చలంగా భరించాలి.

మంగి నడివయసు స్త్రీ. మాసిన దుస్తులు, భుజానికి సంచి ఆమె వృత్తిని స్పష్టంగా తెలియజేస్తున్నాయి. ఆమె ముఖం దుమ్ములో పొర్లాడినట్టుంది. అందులో కళ్ళు మాత్రం తెల్లగా మెరుస్తూ లక్ష్యాన్ని ఛేదిస్తున్నట్లు సూటిగా వున్నాయి.

బస్టాండుకి చేరింది. ఆమె కళ్ళు చకచకా వెదికాయి... ఒక చోట ఇద్దరు కాలేజీ కుర్రాళ్ళు ఏదో మాట్లాడుకుంటున్నారు. మెల్లిగా నడిచింది. "బాబూ.. పది పైసలు!" గొణిగింది. హఠాత్తుగా వాళ్ళ సంభాషణ చెదిరింది. ఒకడు వికారంగా ఆమె వైపు చూసి "పో! అలా!" అన్నాడు.

రెండోవాడు "వెళ్ళవమ్మా" అన్నాడు మర్యాదగా. ఇద్దరూ మళ్ళీ మాటల్లో పడ్డారు. సినిమాల గురించి, అమ్మాయిల గురించి మాట్లాడుకొంటూ, జోకులు వేస్తూ కులాసాగా నవ్వుకొంటున్నారు. మంగి అన్నీ వింటూంది. "బాబూ..." అంటూ కల్పించుకొంది.

"ఛ! వెళ్ళు చెప్పాంగా?" అన్నాడు మర్యాదగా అన్న కుర్రాడు. "బాబూ..." అంది మంగి. ముందు పొమ్మని గట్టిగా చెప్పినవాడు ఇబ్బంది భరించలేక జేబులోంచి చిల్లర తీసి ఆమెచేతిలో వేశాడు. మంగి తృప్తిగా వెళ్ళిపోయింది. కుర్రాళ్ళిద్దరూ హాయిగా ఊపిరి పీల్చుకొని మళ్ళీ మాటల్లో పడ్డారు.

ఈసారి ఇద్దరు నవదంపతులు. సినిమా థియేటర్ వద్ద నిల్చున్నారు. టికెట్లు తీసుకొన్నారు. ఇంకా లోపలికి గేట్లు తియ్యాలా. ఇద్దరూ మెల్లిగా ఏదో మాట్లాడుకొంటున్నారు. ఆమె అతడి మాటలకు బోలెడు సిగ్గుపడుతూంది. మంగిని ఆ దృశ్యం ఆకర్షించింది.

"అమ్మా ధర్మం!" అడిగింది. కొత్త పెళ్ళికూతురు మంగి రూపం చూసి బిత్తరపోయింది. భయంగా వెనక్కి జరిగింది. "ఏయ్! అలా వెళ్ళు!" అన్నాడతడు భార్య ఇబ్బంది గమనించి. మంగి అతడి ఆజ్ఞను ఇసుమంత కూడా పాటించలేదు. "బాబూ!" అంది అతడి వైపు చూసి దీనంగా.

"పొమ్మన్నానా నిన్ను!" అన్నాడతను.

మంగి వదల్లేదు. అతడికేం చెయ్యాలో తోచడం లేదు. మంచి సంభాషణ చెదిరినందుకు భార్య మూతి ముడుచుకుంది. భార్యముందు అతడి పరువు పోయింది. బిచ్చగత్తెను కూడా అతడు తరమలేకపోయాడు. "వెళ్ళవతలకి.." అన్నాడు మంగిని మళ్ళీ.

ఆమెకు కోపం వచ్చి "చిల్లరపడెయ్యండి పోతుంది" అంది. అతడి మనసా మాటతో చివుక్కుంది. అంటే ధర్మం చేయడం అస్సలి



ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 1-3-96

ష్టంలేని దుర్మార్గుడు తనేనా! అడుక్కొనేవాళ్లను దూరంగా వుంచాలన్న సాంఘిక నైజంతో ఏదో అలా ప్రవర్తించాడే గానీ ధర్మం వేయడానికి తనకు అయిష్టం ఏమీ కాదు. అందువల్ల తనే కాదు – ఎవరూ కూడా ఆర్థికంగా నష్టపోయేదేమీ లేదు అనుకున్నాడు లోపల.

ఓడిపోయినట్టు ముఖం పెట్టి మంగివైపు చుర చురా చూసి ఓ రూపాయి వేసాడు. అది చూసి ఆమె "ఎందుకంత వేశారు?" అంది ఆశ్చర్యంగా.

"మరి నేనేదో పిసినారి వయినట్లు మాట్లాడే వుగా!" అన్నాడు.

ఆమె రోషంగా మొహం పెట్టి "నేనన్నది అది కాదు.." అంటూ ఏదో అంటోంది... అతడు కోపంగా మరేదో అంటున్నాడు వాదనాపూర్వకంగా.. మంగి ఇంతలో అక్కడి నుండి నిష్క్రమించింది.

ఎండ బాగా ముదిరింది. మంగి నడిచి నడిచి ఆగింది. కిళ్ళీ బడ్డీ దగ్గర ఆగింది. సోడా తాగి సేదదీరింది. మధ్యాహ్న భోజనాల వేళ దాటింది. ఆమె ప్రొద్దుటెప్పుడో తన బస నుండి బయల్దేరేటప్పుడు తిండి తింది. ఆకలి బాగా వేస్తూందామెకిప్పుడు.


ఒక ఇంటి ముందాగి "అమ్మా ధర్మం!" అంది. లోపల బాగా సందడిగా వుంది. ఏదో కార్యక్రమం జరుగుతోంది. మంగి లోపలి వాతావరణాన్ని గమనించింది. చాలా మంది వున్నారు. ఎవరూ పట్టించుకోలేదామె కేకల్ని. తర్వాత ఎవరో ఒక ఆడావిడ చూసింది. చూడగానే మంగి బిచ్చగత్తెని గుర్తు పట్టేసిందామె. "ఎవరికీ ఇక్కడ ఖాళీ లేదు అలా వెళ్ళమ్మా!" అనేసి వెళ్ళిపోయింది.

మంగి ధర్మమడుగుతూనే వుంది. చాలా సేపు ఎవరూ పట్టిచుకోలేదు. ఎవరో అన్నారు లోపలి నుండి "ఎవరో అడుక్కొనే ఆమె వచ్చింది – మిగిలిన అన్నం, కూరలు వేసేయండి!" మంగికి ఆధారం దొరికింది దాంతో.

"ఆ! ఇప్పుడెవరికీ ఖాళీ లేదిక్కడ. అయినా ఈ అడుక్కొనే వాళ్ళకు వేళాపాళా లేదు.. పొమ్మనండి అవతలికి!" అంది ఓ కంఠం కఠినంగా.

తర్వాతెవరూ ఆమెను పట్టించుకోలేదు. మంగి ఒంటరిగా నిలబడి పోరాడుతూనే వుంది. చాలా మంది ఆడామగా హడావుడిగా అటూ, ఇటూ తిరుగుతూనే ఆమెను పక్కింటికి వెళ్ళమని చెబుతూ వచ్చారు. మంగి ఆశ మాత్రం మిగిలిపోయిన అన్నం – కూరలు అన్న మాట మీదే వుంది. మంగికి ఎప్పుడూ ఒక్కటే బండగుర్తు! ఒకరిద్దరు వున్న చోటకంటే ఎక్కువ మంది వున్నచోటే గిట్టుబాట వుతుంది.ఎందుకంటే ఎక్కువ మంది వున్నప్పుడు అందరూ ఒక మాట మీద నిలబడరు. ధర్మం చెయ్యాలా వద్దా అన్న విషయంలో ఎవరిష్టం వచ్చినట్లు వాళ్ళు నిర్ణయాలు తీసుకొంటారు. అందువల్ల ఎదుటి వ్యక్తికి వాళ్ళు లొంగిపోతారు.

ఇందాకటి కంఠం మళ్ళీ వినిపించింది. "ఏవిటా! తలనెప్పి గొడవ? ఏదోటి పడెయ్యండి పోతుందది




ఒక నడివయసావిడ గొణుక్కొంటూ వచ్చింది చేతిలో పళ్ళెంతో. దాని నిండా అన్నం, కూరలు వున్నాయి. మంగి వినయంగా జోలె పట్టింది. ఆవిడ దూరంగా నిలబడి పదార్థాలు జోలెలో వేసింది.

మంగికి అన్నం కూరలు చూడగానే ఆకలి తన్నుకొచ్చింది. నిభాయించుకొని మరో ఇంటికి వెళ్ళింది. ఆ పూటామెకి అదే ఆఖరి ఇల్లు! మధ్యాహ్న భోజనం చేసాక రెండోపూట బిచ్చానికి బయల్దేరదల్చుకొందామె.

గుమ్మం ముందాగింది. పిలిచింది. నిశ్శబ్దంగా వుంది. లోపలెక్కడా మాటలు వినిపించడం లేదు. చాలాసార్లు పిలిచింది. వెళ్ళిపోదామనుకుంది. అయినా పట్టువీడక ఇంటి లోపలికి నడిచింది. రెండో గుమ్మం దాటి మూడో గుమ్మం ముందాగింది!

"అమ్మా ఆకలి!" పిలిచింది లోపలికి చూస్తూ.

ఏడేళ్ళ పిల్ల ప్రక్కనున్న గదిలోంచి ఎందుకో బయటికొచ్చింది. శబ్దానికి తలతిప్పి అడుగు దూరంలో వున్న మంగి ఆకారాన్ని చూసి కెవ్వుమని అర్చింది.

"ఏమయ్యింది?" అంటూ తల్లి గాబరాగా వచ్చింది. "అయ్యో! బిచ్చగత్తె లోపలికి వచ్చేసిందే సరాసరి! ఇదేం గొడవ?!" అంది.

**అప్ప**

"నువ్వు చెప్పిన డాక్టర్ని ఇవాళ కలిసాను" అన్నాడు సురేష్.

"నేను పంపించానని చెప్పావా?" అడిగాడు వంశీ.

"చెప్పాను"

"ఏం చేసాడు?"

"మొన్నెప్పుడో వెయ్యి రూపాయిలు అప్ప తీసుకుని పోయావట. అది కట్టమని గొంతు పట్టుకున్నాడు" చెప్పాడు సురేష్.

–పి.వి.మురళీకృష్ణ

"ఆ!" అంటూ ఆశ్చర్యపోతూ లోపలి నుండి భర్త వచ్చాడు.

"నడునడు బయటికి.. ఎవరూ లేకపోతే ఏదోటి దొరకబుచ్చుకుపోదామనుకొన్నావా!" అన్నాడతడు కర్కశంగా. మంగి ఇవేం పట్టించుకోకుండా తన దోవలో తానుంది.

"నడుస్తావా లేదా బయటికి?" అంటూ అతడు మంగిని నెట్టడానికి దగ్గరకొచ్చాడు. మంగి అతడి వైపు చూసింది.

అసహ్యంగా ఉన్న ఆమె ముఖంలో కళ్ళు మాత్రం తెల్లగా వున్నాయి. చూపులు అన్ని విధాలయిన మనుషుల్ని గమనించినట్టు నిర్భయంగా వున్నాయ్.

అందుకే అతడు తన ప్రయత్నం విరమించుకొన్నాడు. "ఇలా లోపలికి రాకూడదు వెళ్ళు!" అన్నాడు. చిన్నపిల్ల భయంపోయి ఉత్సాహంగా చోద్యం చూస్తూంది.

భార్యాభర్తలిద్దరూ ప్రయత్నిస్తున్నారు మంగిని వెళ్ళగొట్టడానికి. మంగి వెనక్కి నడిచింది. బిచ్చమడగడం మాత్రం మానలేదు. "వెళ్ళమ్మా దయచేసి!" అన్నాడు భర్త. ఏదో విధంగా ఆమెను ఏమీ ఇవ్వకుండా పంపించివేయాలన్న ఉద్దేశంలో వున్నాడతను.

"ఏమిటే వెళ్ళడం లేదా?" అంటూ అక్కడికి ప్రవేశించాడు అతడి తండ్రి "బయటికి పంపి తలుపు వేసెయ్' ' అన్నాడు మళ్ళీ.

"ఏమిటీ! బిచ్చగత్తెతో గొడవ" అంటూ వచ్చింది. అతడి తల్లి.

భార్య అత్తగారితో పిల్ల భయపడ్డ వైనం వర్ణించింది. "వామ్మో! భలే బిచ్చగత్తే!"... వెళ్ళమ్మా అలా వెళ్ళు" అంటూ తన ప్రయత్నం తాను చేసిందామె.

మంగి దాదాపు బయటి గుమ్మం వరకూ నడిచింది. ఇంకో రెండు అడుగులు బయటికి వేసుంటే అతడు తలుపులు వేసేసేవాడే! మంగి దీనంగా బిచ్చమడుగుతూంది ఇంకా.

అక్కడున్న నలుగురిలో ఎవరూ ఆమెకు బిచ్చ

మేసేలా లేరు. మంగి ప్రాధేయపడ్డం, వాళ్ళు పొమ్మనడం ఈ నేపథ్యంలో కొద్ది క్షణాలు గడిచాయి.

"పోనీ ఆ అన్నం మిగిలిందే కదా! అది పారేయ్యమ్మా పోతుంది!" అంది పెద్దావిడ కోడలితో.

దాంతో మంగి ముఖంలో పైకి ఏ మాత్రం కనిపించని చిరుదరహాసం వెల్లివిరిసింది. తన ప్రయత్నం వృధా పోలేదు. ఇప్పుడు ఎవర్ని అడగాలో అర్ధమయిందామెకు. అతడి తల్లినే చూస్తూ బిచ్చమడుగసాగింది. ఆమెనే తన ప్రధాన కేంద్రంగా ఎంచుకొంది మంగి ఇప్పుడు. అంత మందిలో బిచ్చగత్తె తననే పదే పదే బ్రతిమిలాడడంతో క్రమంగా ఆమె మనస్సు మంగికి అనుకూలంగా మారుతోంది!

"ఎందుకూ! వీళ్ళకు వేసే కొద్దీ ఇదే అలవాటవుతుంది" అన్నాడామె కొడుకు.

మంగి ఇంకా ఆనంద పడింది. 'ధర్మం' విషయంలో నలుగురి మధ్య అలాంటి అభిప్రాయ భేదం వచ్చినప్పుడే వాళ్ళు తనకు వేగిరంగా లొంగుతారు.

"వేసేస్తే అది పోతుంది. మనకు తలనొప్పి వుండదు!" అంది తల్లి తన వాదనను సమర్ధించుకొంటూ.

అతడు మౌనం వహించాడు. అత్తగారు కోడల్ని పిలిచి చెప్పింది. "వెళ్ళమ్మా వెళ్ళి అన్నం తీసుకురా!' ' అతడు కాదని ఖండించలేకపోయాడు. బిచ్చమేయడమన్నది చాలా చిన్న విషయం. కానీ ప్రారంభంలోనే అతడు కాదు అన్న నిర్ణయాన్ని తీసుకోవడం వల్ల ఇరకాటంలో పడ్డాడు. వేరే వాళ్ళు బిచ్చం వెయ్యడానికి సిద్ధపడినప్పుడు తను దాన్ని ఆపితే విషయాన్ని సీరియస్‌గా తీసుకొన్నట్టవుతుంది! పైగా బిచ్చగత్తె చూస్తూండగా ఆమెకు రాబోయే ఆదాయాన్ని ఆపడం ఇబ్బందైన పనే! అలా అడ్డుకట్ట వెయ్యకపోయినా బిచ్చగత్తె ముందు చులకనే.. ఎందుకంటే ఆమె 'మరి, ముందు ఇతడెందుకు బిచ్చం వెయ్యకూడదన్న నిర్ణయాన్ని తీసుకొన్నాడు పెద్ద గొప్పగా' అని తన గురించి ఒక అసమర్ధుడిలా ఊహిస్తుందని భయం! ఫీలింగ్!!

ఇంతలో అతడి భార్య లోపలికి వెళ్ళి అన్నం తీసుకొచ్చింది. అంతసేపూ ఆమెను వెళ్ళగొట్టడానికి అష్టకష్టాలు పడ్డ అతను ఓడిపోయి ప్రత్యర్ధి ముఖం చూసే ధైర్యం లేక చూపులు పక్కకి తప్పించాడు.

** ** **

మంగి తన బసలో పడుకొని ఆలోచిస్తోంది. అసలామెది ఆ పట్నం కాదు దానికి సమీపంలో వున్న పల్లె. పల్లెలో ఆమె వ్యవసాయ కూలీగా కష్టించి పనిచేసి బ్రతికేది. వంట్లో చేవ తగ్గేక ఇక్కడికొచ్చి బిచ్చమెత్తుకొంటోంది. కొద్ది రోజుల క్రితమే ఆమెకు పల్లె నుండి కబురొచ్చింది! తెలిసినవాళ్ళింట్లో పెళ్ళి. తను వెళ్ళాలి. రేపే!

**తెలీదు**

"ఏమండీ డైరెక్టరుగారూ! ఇకమీదట నేను రేప్ సీన్స్‌లో నటించను."

"ఇప్పుడేమయిందని?"

"నాకిప్పుడు మూడో నెల"

"ఓహో అదా! ఆ వేళ సెట్లో కరెంటు పోతుందని నాకు మాత్రం ఏం తెల్సు?" క్యాజువల్‌గా అన్నాడు డైరెక్టర్.

— వి. మల్లిఖార్జున్

ఉదయమే తయారయ్యింది. బిచ్చ మెత్తుకొని సంపాదించిన డబ్బులతో మంచి చీర కొనుక్కొంది ఇదివరకే. అది కట్టుకొని గౌరవనీయమైన స్త్రీలా అలంకరించుకొంది. బజార్లో వున్న బస్టాండులో నిల్చుంది. తన పల్లెకెళ్లే బస్సు కోసం! బస్సు ఎంతకీ రావడం లేదు. అసహనంగా ఎదురు చూస్తూంది!

అక్కడ కొందరామె చూపుల్ని ఆకర్షించారు.. వాళ్ళు! బిచ్చగాళ్ళు!

మంగి కొత్త చీరలో గౌరవంగా కనిపిస్తే ఆమె వద్దకు కూడా వచ్చారు ఒకరిద్దరు.. మంగి వాళ్ళను కసిరి పొమ్మంది. వెళ్ళిపోయారు. మంగి నవ్వుకొంది. తనముందా వాళ్ళ ఆటలు!

బస్సులు వస్తున్నాయి, పోతున్నాయి. తన బస్సు రావడం లేదు. మంగి నిట్టూర్చింది. అక్కడున్న జనాల్ని తప్పించుకొని ఇంతలో ఒక బిచ్చగత్తె వంగిపోయి అసహ్యంగా వున్న అల్యూమినియం బొచ్చె చాచింది మంగికేసి! సూర్యుడు సరిగ్గా అప్పుడు కాస్త పైకెదిగాడు. వేడిని బాగా పెంచుకొని. మంగి కలవరపడింది ఆమె ఆకారం చూసి.

"వెళ్ళవతలికి!" అంది గట్టిగా. మంగికి తన మాట తనకే విచిత్రంగా అన్పించింది. ఆమె మంగి ధాటికి వెనకడుగు వేసింది. నల్లగా, వికారంగా వుందామె! చంకలో పసిపిల్లాడు! వాడు మూతి నిండా ఏదో వులుముకొని నములుతున్నాడు. ఆమె తల రేగిపోయి చమటకు ముఖం నిండా అంటుకుపోయి వుంది.

కానీ ఆమె వెళ్ళలేదు. ఇంకా దీనంగా ప్రాధేయపడుతూంది. మంగికి పూర్తిగా కొత్త అనుభవం అది! ఇంతకు ముందెప్పుడూ ఆమె ఇలాంటి స్థితి ఎదుర్కోలేదు! ఎలాగయినా బిచ్చగత్తెను తక్షణం వదిలించుకోవాలని నిశ్చయించుకొంది.

"ఏయ్! ఫో! చెబుతూంటే నీక్కాదూ?" అని గద్దించింది.

ఆమె బొచ్చె ఆడిస్తూ చంకలో పిల్లను చూపిస్తూ మరింత బ్రతిమలాడుతూంది. మంగికి కంపరం పుట్టింది.

"చిల్లరలేదు వెళ్ళు.." అంది.

"పిల్ల అన్నం లేక అల్లాడిపోతూంది! పది పైసలు వెయ్యమ్మా!" అంటూ బ్రతిమిలాడుతోంది.

"చిల్లర లేదన్నావా?"

"అమ్మా తల్లీ! నీ దయ!!"

మంగి పొమ్మనడం, ఆమె కాళ్ళా వేళ్ళా పడ్డం.. ఇలా నిమిషాలు గడిచిపోతున్నాయి. ఇద్దరి మధ్యా రాజీ కుదిరే మార్గం కనిపించడం లేదు. మంగికి గుర్తొంచిందప్పుడు. ఆదే బస్టాండులో తను ఎందరో ప్రయాణీకుల్ని విసిగించి, వేసారించి పైసలు రాబట్టిన వైనం! కానీ, ఆమె ధర్మం చేయదల్చుకోలేదు. ఎలాగయినా బిచ్చగత్తెను పంపించివేయాలన్న పట్టుదలలో వుంది.

చుట్టూ వున్న జనాలకు ఇదో ఆకర్షణ అయ్యింది. అందరి చూపులూ ఆసక్తిగా వాళ్ళిద్దరిపైనే వున్నాయి! ఎవరు నెగ్గుతారోనన్న ఆత్రుత? మంగి నిశ్చేష్టురాలయింది. చుట్టూ మనుషులు తామిద్దరిపై ఏకాగ్రత చూపేసరికి! బిచ్చగత్తె మాత్రం ఏమీ పట్టించుకోవడం లేదు. తన గొడవలో తానుంది.

మంగి ఆమెను వెళ్ళగొట్టడానికి శతవిధాలా ప్రయత్నిస్తూంది. కానీ ఆమె మరింత జాలిగా, పట్టుదలగా అడుగుతూంది. ఇద్దరి ప్రహసనం గమనించి కొందరు నవ్వుతున్నారు. ఇద్దరు, ముగ్గురు పిల్లలు చుట్టూ మూగారు.

మంగికి ఊపిరి పీల్చుకోవడం కష్టమయింది బిచ్చగత్తెధాటికి! ఇంతలో ఆమె బస్సు వచ్చేసింది! దుమ్ము రేపుకొంటూ బస్సు ఆగింది.. ఆ బస్సుకు వెళ్ళవలసిన వాళ్ళు ఎగబడుతున్నారు. మంగి బ్రతుకు జీవుడా అనుకొంటూ కదిలింది. బిచ్చగత్తె అడ్డుపడింది!!

"అమ్మా! అమ్మా!" అంటూ బొచ్చె ముఖం ముందు ఆడిస్తూంది. మంగికి భయం వేసింది తను ఓడిపోతుందేమోనని. తను బస్సెక్కడానికి అడ్డు వచ్చినందుకు ఆమె బిచ్చగత్తెపై చాలా ఆగ్రహంతో వుంది. పిచ్చ కోపంతో ఎదుటున్నామెను కాలితో తన్నుదామనిపించింది కూడా ఆమెకు.

ఎవరో పెద్దాయన అంటున్నాడు "పోన్లే అమ్మా చిల్లర పడేయ్ పోతుంది!!"

మంగి ఇరకాటంలో పడింది. ఆయన మాట కాదంటే అక్కడ చిన్నతనం, అవునంటే బిచ్చగత్తె ముందు పరువు నష్టం! అందరూ ఆమెనే ఆశ్చర్యంగా చూస్తున్నారు.. ఆమె ఆ బస్సు కెళ్ళాలని అందరికీ అర్ధమయింది.

మంగి చేసేదిలేక పదిపైసలు తీసి బిచ్చగత్తె గిన్నెలో వేసి ఊపిరి పీల్చుకొంది. బిచ్చగత్తె వెళ్ళిపోయింది.

మంగి స్వేచ్ఛా విహంగంలా పరుగులాంటి నడకతో వెళ్ళి బస్సులో కూలబడింది. తర్వాత బస్సు కదిలి వెళ్ళిపోతున్నా ఆమె గుండె చప్పుడు ఇంకా తగ్గలేదు.

.. కానీ, ఆ చేదు అనుభవంతో మంగికి ప్రజల్ని అన్ని ఇబ్బందులకు గురిచేస్తున్న తన వృత్తిపై చాలా వికారమైన భావం పుట్టిందాక్షణంలో...